రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త






నందమూరి జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జూనియర్ ఎన్టీఆర్



తలకొండపల్లిలో ఖాళీ సిలిండర్లతో క్యూకట్టిన దృశ్యం

# బండ కోసం బారులు

- ★ గ్రామాలలో తగ్గని గ్యాస్ కష్టాలు
- ★ ధరల భయంతో ఏజెన్సీకి ఎగబడుతున్న జనం
- ★ ఇబ్బందులు అర్థం చేసుకోవాలని మహిళల వేడుకోలు

**తలకొండపల్లి, మే28 ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎల్పీజీ సిలిండర్ల కొరత వేధిస్తోంది. ఇటీవల గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో, ఎక్కడ సిలిండర్ ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయోనన్న భయంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ నేపథ్యంలో, ఇంట్లో ఉన్న గ్యాస్ పూర్తిగా ఖాళీ కాకముందే అడ్వాన్స్‌గా సిలిండర్ తెచ్చుకోవాలనే ఆరాటంతో, స్థానిక శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ గోదాము వద్ద తెల్లవారుజాము నుంచే ప్రజలు ఖాళీ సిలిండర్లతో కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నారు.

**సిలిండర్ల బండి వస్తుందన్న ఆశతో..**

రెండు రోజులుగా స్టాక్ లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో, గురువారం సిలిండర్ల బండి వస్తుందనే సమాచారంతో వినియోగదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూ లైన్లలో నిరీక్షించారు.

ఖాళీ సిలిండర్లతో వందలాది మంది ప్రజలు అప్పటికే అక్కడకు చేరుకుని పెద్ద లైన్లలో బారులు తీరారు. గత రెండు రోజులుగా గోదాములో స్టాక్ లేకపోవడంతో, ముందే బుక్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ల కోసం ఎంతో ఆశగా ఎదురుచూశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిలిండర్ కోసం ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

ప్రజల ఇబ్బందులను, వారి ఆందోళనను ప్రభుత్వం గుర్తించాలని, వినియోగదారులందరికీ సక్రమంగా సిలిండర్లు అందేలా తగిన చర్యలు చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## బక్రీద్ కోలాహలం



తాండూరులో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు, బక్రీద్ వేడుకలలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తదితరులు



# వర్షానికి మునిగింది మూడు వేల బ్యాగులు

- ◗ అప్రమత్తమైన యంత్రాంగం
- ◗ రంగంలోకి దిగిన అదనపు లారీలు
- ◗ అత్యవసరంగా మిల్లులకు తరలింపు
- ◗ తడిసిన ధాన్యం అంతా కొంటున్నాం
- ◗ కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తరలింపు వేగవంతం చేసి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల పరిధిలో సుమారు 3 వేల బ్యాగులు, 120 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైందని తెలిపారు. అదనపు లారీలు, ట్రాక్టర్లతో తడిసిన ధాన్యాన్ని పారా బాయిల్డ్ మిల్లులకు తరలింపునకు చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

**రైతులకు నష్టం రాకుండా చర్యలు**

తడిసిన ధాన్యం రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి అత్యవసరంగా పారా బైయిల్డ్ మిల్లులకు తరలింపు చర్యలు చేపట్టామన్నారు. బుధవారం ఒక్క రోజే సుమారు 120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీపంలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కడైతే వర్షపు నీటితో తడిసిన ధాన్యాన్ని సంచుల్లో నింపి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**పరిగి, మోమిన్ పేట్, కుల్కచెర్ల మండలాల్లో భారీ దెబ్బ**

పిపిసి సెంటర్ పరిగి మండలం సుల్తాన్ పూర్ గ్రామం, పిపిసి సెంటర్ బాలంపేట్ గ్రామం, దౌల్తాబాద్ మండలం, పిపిసి సెంటర్ మేకవనం పల్లి గ్రామం, మోమిన్ పేట్ మండలం, పిపిసి సెంటర్ ముజాయిద్‌పూర్ గ్రామం, కుల్కచెర్ల మండ లంలో నిల్వ చేసిన వరి ధాన్యం వర్షాల కారణంగా పూర్తిగా తడిసి పోవడంతో అధికారులు వెంటనే స్పందించి పరిశీలించి పారా బాయిల్డ్ మిల్లులకు తరలించడం జరిగిందన్నారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది**

రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ధాన్యాన్ని సురక్షితంగా తరలించి ఎంఎస్పీ చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లులకు తరలింపు, ఎంఎస్పీ చెల్లింపుల ప్రక్రియలను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు.

# ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ స్కెచ్



ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి

- ◆ ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడి నుంచే నిర్వహిస్తాం
- ◆ ఎఫ్‌సిడిఎ కార్యాలయ భవనానికి త్వరలో సిఎంతో ప్రారంభోత్సవం
- ◆ ప్రస్తుత పునాదులపై భవిష్యత్‌లో అత్యాధునిక నిర్మాణాలు
- ◆ ఇక్కడ తీసుకునే నిర్ణయం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే ఉంటుంది
- ◆ యువతకు ఉపాధి గ్యారంటీ లక్ష్యంతో స్కిల్స్ వర్సిటీ
- ◆ ముమ్మరంగా శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు
- ◆ ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నాం
- ◆ మా హయాంలోనే ఫ్యూచర్ సిటీ పూర్తి చేస్తాం
- ◆ మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి

**రంగారెడ్డి అర్బన్, మే 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును భవిష్యత్తులో ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనాన్ని గురువారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత అదే పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనులను కూడా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోందని తెలిపారు. జూన్ 2 లేదా 3వ తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇక్కడ ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యాచరణ, ప్రతి నిర్ణయం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వేస్తున్న బలమైన పునాదులపై రానున్న రోజుల్లో అత్యాధునిక నిర్మాణాలు వెలిసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాంతంలో ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యాల యాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. యువత నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చట్టం ద్వారా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తుచేశారు.

మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ.. ఫ్యూసిటీ ప్రాజెక్ట్ కేవలం తెలంగాణకే కాకుండా దేశానికే ఒక మకుటంలా, తలమానికంగా నిలిచేలా రూపుదిద్దుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని మరే ఇతర దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు.

ఈ మెగా ప్రాజెక్ట్ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం తాత్కాలిక క్యాం పస్‌లో నడుస్తున్న స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణం అత్యంత వేగంగా జరుగుతోందని, పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యూచర్‌సిటీ అధికారులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇళ్లే వాళ్ల టార్గెట్

### మజీద్‌పూర్ ప్రజయ్ హోమ్స్‌లో భారీ చోరీ

### 80 గ్రాముల బంగారం, నగదు అపహరణ

**శామీర్‌పేట, మే 28 ప్రభాతవార్త:** శామీర్‌పేట పరిధిలోని మజీద్పూర్‌లో గల ప్రజయ్ హోమ్స్‌లో గురువారం భారీ దొంగతనం వెలుగుచూసింది. ఒక ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు విరగొట్టి బీరువాలో ఉన్న సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలు, కొంత నగదును దోచుకెళ్లారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం... మజీద్‌పూర్‌లోని ప్రజయ్ హోమ్స్‌లో బిల్ల అంజనేయులు తన భార్య సుధారాణి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసముంటున్నారు. పెద్ద కుమార్తె హాస్టల్‌లో ఉంటుండగా, భార్య, చిన్న కుమార్తె నాలుగు రోజుల క్రితమే మియాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో అంజనేయులు ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆయన ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం 6 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి చేరుకోగా, ఇంటి ప్రధాన ద్వారం తాళంతో పాటు లోపలి గది తాళాలు కూడా విరగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోని బట్టలు, వస్తువులన్నీ దొంగలు చెల్లాచెదురుగా పడేసి, బీరువా తాళం పగలగొట్టి అందులోని 80 గ్రాముల బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది.



డివైడర్ ఎక్కిన కారు వేగాన్ని నియంత్రించిన వృక్షం

## వాళ్లకి ఆ చెట్టే .. ప్రాణదాత

- నియంత్రణ కోల్పోయి డివైడర్ ఎక్కిన కారు
- పల్టీలు కొట్టకుండా అడ్డుకున్న వృక్షం
- తృటిలో తప్పిన పెను ప్రమాదం..
- బయటపడిన ఆరుగురు ప్రయాణికులు
- ఆర్టీసీ డ్రైవర్ సమయస్ఫూర్తితో
- వెనక వస్తున్న బస్సుకీ తప్పిన ముప్పు
- ఊపిరిపీల్చుకున్న బస్సు ప్యాసింజర్లు
- తూంకుంట రాజీవ్ రహదారిపై కలకలం

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త :** శామీర్పేట మండలం తూంకుంట వద్ద రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. గురువారం మధ్యాహ్నం ఖతా టిఫిన్ సెంటర్ ఎదురుగా శామీర్పేట వైపు వెళ్తున్న ఒక కారు, ముందున్న ఆర్టీసి బస్సును అతివేగంతో ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డివైడర్ మధ్యలో ఉన్న ఒక చెట్టు కారును అడ్డుకోవడంతో కారు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ లోపల ఉన్న ముగ్గురు పిల్లలు, ఇద్దరు పెద్దలు ప్రాణాలతో బయటపడ్డారు. అదే సమయంలో కారు వెనుక వస్తున్న ఆర్టీసి బస్సు డ్రైవర్ అత్యంత సమయస్ఫూర్తితో బస్సును నిలిపివేయడంతో వెనుక నుంచి జరగాల్సిన పెద్ద ప్రమాదం ముందస్తుగానే ఆగిపోయింది. బస్సులోని ప్రయాణీకులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైనప్పటికీ, సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా రాజీవ్ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న అల్వాల్ ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని, డివైడర్‌పై ఉన్న కారును పక్కకు నెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మిస్సెస్ ఇండియా ఆశా దీపిక

# శంషాబాద్‌లో మెరిసిన ఆశా

## మిస్సెస్ ఇండియా దీపికకు అభిమానులు ఘన స్వాగతం

**రంగారెడ్డి అర్బన్, మే 28 ప్రభాతవార్త:** బెంగళూరు వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక మిస్సెస్ ఇండియా కాస్మోస్ ఆర్గనైజేషన్ పోటీలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 30 మంది టాప్ మోడల్స్‌ను వెనక్కి నెట్టి, మిస్సెస్ ఇండియా కిరీటాన్ని కైవసం చేసుకున్నారు తెలుగు తేజం ఆశా దీపిక. ప్రపంచ అందాల పోటీల్లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైన ఆమె, విజేతగా తొలిసారి గురువారం నాడు నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు అభిమానులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.

**గ్లోబల్ స్టేజ్‌పై తెలుగు అమ్మాయి..**

ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడిన ఆశా దీపిక తన సంతోషాన్ని పంచుకున్నారు. వచ్చే సెప్టెంబర్‌లో జరగబోయే మిస్సెస్ వరల్డ్ గ్లోబల్ పోటీల్లో యూనిటీ ఆర్గనైజేషన్ తరపున పాల్గొనబోతున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ అంతర్జాతీయ పోటీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళ తానే కావడం విశేషమని ఆమె గర్వంగా పేర్కొన్నారు. నేషనల్ లెవెల్‌లో భారతదేశ కీర్తిపతాకాన్ని ఎగరేయడమే తన లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు.

**టెక్నాలజీ రంగం నుండి మోడలింగ్ వైపు..**

కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా, ఆశా దీపిక ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వర్క్ చేస్తున్నారు.

టెక్నాలజీ రంగంలో తాను ఒక సాధారణ వ్యక్తి గా ప్రయాణాన్ని ప్రారంభించానని చెప్తూనే, తన నాలెడ్జ్‌తో దేశానికి సేవ చేయాలనే పట్టుదలను కనబ రిచారు. ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి ఒక కీలకమైన ప్రాజెక్ట్ చేయడానికి ఆమె అంగీకరించారు. భవిష్యత్తులో ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తూ, ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి అత్యుత్తమ ప్రాధాన్యత, గుర్తింపు తెచ్చేలా కృషి చేయడమే తన ఆశయమని ఆమె వెల్లడించారు.

**నేను పక్కా హైదరాబాదీని..!**

తన నేపథ్యం గురించి మాట్లాడుతూ.. "నేను పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి పట్టణంలోనే అయినా, పెరిగింది, చదువుకుంది అంతా భాగ్యనగరంలోనే.. కాబట్టి నేను పక్కా హైదరాబాదీని" అని సంతోషంగా చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడి, తన కెరియర్ అంతా అక్కడే గడిపినప్పటికీ, దేశంపై ఉన్న ప్రేమతో, మోడలింగ్‌లో రాణించాలనే లక్ష్యం కోసమే భారతదేశానికి తిరిగి వచ్చినట్లు ఆశా దీపిక స్పష్టం చేశారు.

## తెలంగాణ మీ జాగీరా?

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త:** ఏపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను హైదరాబాద్‌కు రావద్దని వదిలి వెళ్ళిపోవాలని వ్యతిరేకించే వారందరూ నైజాం నిరంకుశ పాలకుడు కాశీం రెజ్వి వారసులేనని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గొంటి కుమార్‌చౌదరి ఆరోపించారు. తెలంగాణ ప్రాంత ప్రజలు నిజాం నిరంకుశపాలనలో అల్లాడిపోతుంటే ఎందరో మహానుభావులు కులం, మతం, ప్రాంతం అనే భేదం లేకుండా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి విముక్తి కలిగించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రముఖ సినీ నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఎన్‌టిఆర్ ఘాట్‌లో, పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతం పాకిస్తానా ? లేక మీ జాగీరా? అని ఆయన ప్రశ్నించారు. దమ్ముంటే మీఇంటికి వచ్చి దాడి చేస్తాం సిద్దమా అని హెచ్చరించారు. ఎన్టీఆర్ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, రెండు రూపాలకే కిలో బియ్యం అందించారని, పేదలకు గృహాలు నిర్మించారని, ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ఆయన చెప్పారు. ఎన్టీఆర్ చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత రత్న అవార్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### అంజనీ కుమారికి సామాజిక సేవారత్న పురస్కారం

**చిక్కడపల్లి, మే 28 (ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జి.పి.ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాల సందర్భంగా సి.ఎస్.సి కోర్టు సూపరింటెండెంట్, ఐక్య సాహితి వేదిక తెలంగాణ ఉమెన్ చైర్ పర్సన్ పి.వి.పి. అంజనీ కుమారి కి ఎన్టీఆర్ సామాజిక సేవారత్న" పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళామారుతి కళావేదికలో జరిగింది. కార్యక్రమానికి అతిథులుగా రంగస్థల నటులు డి. నాగేందర్, బీజేపీ రాష్ట్ర నేత వంశీ కృష్ణ , అంతర్జాతీయ గాయకుడు డాక్టర్ చింతలపూడి త్రినాథ్ రావు, జి.పి.ఆర్ట్స్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి. నాగేంద్ర రావు, జె. శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్త కె. సురేష్, కమిటీ సభ్యులు బి. రాధారావు, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, ఎ. విశ్వనాథ్, ఎమ్.జె.కె. మూర్తి, కె. బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ రాజ్ గౌడ్ శిష్యురాలు కుమారి గోపికా కృష్ణ గౌడ్ చేసిన నృత్య ప్రదర్శన సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత మాతకు జేజేలు పేరిట నిర్వహించిన సంగీత విభావరిలో ప్రముఖ గాయనీమణులు అఖిల, ఆర్. జ్యోతి, అనూరాధ, రజని, అమృత, ఆలపించిన ఎన్టీఆర్ చిత్రాలలోని సదాబహార్ గీతాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి.

### టిపిసిసి ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా పోతుల మల్లేష్

**జూబ్లీహిల్స్, మే 28, ప్రభాతవార్త:**

టీపీసీసీ ఎస్సీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా ఫిల్మ్‌నగర్‌కి చెందిన పోతుల మల్లేష్ మదాసి కురువని నియమిస్తూ రాష్ట్ర పీసీసీ ఎస్సీ విభాగ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ ఎస్సీ విభాగ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతం నియామక పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పోతుల మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఎస్సీ ఉపకులాలను గుర్తిస్తూ తనకు రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిందన్నారు. టీపీసీసీ ఎస్సీ సెల్ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పాటుపడతానన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఎస్సీ విభాగ చైర్మన్, ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణకి 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశంకి కృతజ్ఞతలు తెలిపారు.

### ఇంటింటికి సభ్యత్వ నమోదు చేపట్టాలి : ఆనంద్ కుమార్‌గౌడ్

**గన్‌ఫౌండ్రి,మే 28ప్రభాతవార్త:**

నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు పరిశీలకులు గాషేక్ అబ్దుల్లా సోహిల్ నియమితులయ్యారు.ఈమేరకు నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌అగర్వాల్ మర్యాద పూర్వకంగా కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా షేక్ అబ్దుల్లా సోహిల్ మాట్లాడుతూనాంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కలిసి కట్టుగా బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేయాలన్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకిత భావంతో పని చేయాలన్నారు.సభ్యత్వ నమోదు ప్రతి ఇంటింటికి తిరిగి చేపట్టాలని పిలుపు నిచ్చారు.ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు.

### ముజీబ్‌హుస్సేనీ కలిసిన టిఎన్‌జిఓ ప్రతినిధులు



టిఎన్‌జిఓ కేంద్రసంఘం ప్రధానకార్యదర్శి డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ సన్మానం చేస్తున్న దృశ్యం జిల్లా ప్రతినిధులు కె.ఆర్ రాజ్‌కుమార్

**అఫ్జల్‌గంజ్,మే 28ప్రభాతవార్త:** బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం తెలంగాణ నాన్‌గజిటెడ్‌కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ మర్యాద పూర్వకంగా కలిసి బక్రీద్‌పండుగు శుభాకాంక్షలు తెలిపి శాలువ కప్పి సన్మానించారు.కార్యక్రమంలో టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా కార్యని ర్వాహ క అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,జిల్లా ప్రతినిధులు బి.శంకర్, వైదిక్ శాస్త్రి,శ్రీధర్,ఉస్మాన్,రామకృష్ణారెడ్డి,మహ్మద్ చావుష్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**చిక్కడపల్లి మే 28 (ప్రభాతవార్త ) :**

తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను గురువారం చిక్కడపల్లి తో పాటు వివిధ ప్రాంతాలలో ఎన్టీఆర్ వీరాభిమాని, ప్రముఖ సంఘసేవకులు నైషధం సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. పేదల పెన్నిధిగా, తెలుగువారి ఆరాధ్య దైవంగా ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రాజకీయాల్లో ఆయ న చూపిన విప్లవాత్మక మార్పులు ఎప్పటికీ చిరస్మరణీయమని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని మహానాయకుడికి అంజలి ఘటించారు.

### 3న గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సోసైటి సర్వసభ్య సమావేశం

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సోసైటి సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీన చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో జరుగుతుందని సోసైటి అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం కీలకమైనదని, సోసైటి సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎన్‌టిఆర్ ఆశయాలే ప్రజాసేవకు స్ఫూర్తి



అడ్డగుట్టలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడిపి నేతలు వల్లారపు శ్రీనివాస్



కెపిహెచ్‌బి కాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్



మూసాపేటలో ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెదేపా నాయకులు



ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్.



ఎల్లారెడ్డిగూడ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి.



హరిబౌలి కోవబేలా చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేశం నేతలు రవీంద్రాచారి, చంద్రకుమార్, శ్రీకాంత్, దుర్గేష్ తదితరులు



చాంద్రాయణగుట్ట కుమ్మరివాడిలో నందమూరి చిత్రానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు నాగేష్, తయ్యబా తస్లీం, యాదిలాల్ తదితరులు



టీడీపీ నగర కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ తెలుగుదేశం నేతలు



మాజీ కార్పొరేటర్, నగర టిడిపి ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో పేదలకు ఆహారపొట్లాల పంపిణీ చేస్తున్న దృశ్యం



మధీనగూడలోని దీప్తిశ్రీనగర్‌లో ఎమ్మెల్యే గాంధీతో కలిసి ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న రాహుల్ తదితరులు



మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు



నందమూరి తారకరామారావు 103వ జయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ,మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్‌లు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవ రెడ్డి,సుధాకర్ గౌడ్, యువ నాయకులు పాల్గొన్నారు.



మధురానగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద టీడీపీ శ్రేణులు



ఎన్టీఆర్ జయంతి సందర్భంగాఫుడ్ ప్యాకెట్లను అందిస్తున్న నందమూరి కుటుంబ సభ్యులు.

### ఎన్టీఆర్‌ను పరిచయం చేసిన బ్యానర్ వారసురాలికి మహానంది పురస్కారం

**చిక్కడపల్లి మే 28 ( ప్రభాతవార్త ) :** విఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు ను చిత్ర సీమకు పరిచయం మా బ్యానర్ ఏం అర్ ఎ ప్రొడక్షన్స్ నిర్మించిన మన దేశం సినిమా లో అని ప్రఖ్యాత సినిమా నిర్మాత అనురాధా దేవి చెప్పారు. మా అమ్మ కృష్ణ వేణినీ జీవితాంతం ఆయన అభిమానించే వారని అంటూ ఆయన పేరిట అవార్డ్ అందుకోవటం సంతోషం వ్యక్తం చేశారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత నటుడు నందమూరి తారక రామా రావు 103 వ జయంతి సందర్భంగా వంశీ ఎన్ టి ఆర్ మహానంది గ్లోబల్ అవార్డులు సాహిత్య సంగీత సినీ సేవా రంగ ప్రముఖులతో పాటు విదేశీ తెలుగు సంస్థల ప్రతినిధులకు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఎన్ టి ఆర్ ను తెలుగు తెరకు పరిచయం చేసిన కృష్ణ వేణి కుమార్తె అనురాధ ను సత్కరించటం అపురూపం అన్నారు. అవార్డ్ గ్రహీతలలో ఒకరైన ప్రఖ్యాత సినీ జర్నలిస్ట్ భగీరథ మాట్లాడుతూ తాను శక పురుషుడు తారక రాముడు గ్రంథం యెన్ టి ఆర్ శత జయంతి సందర్భంగా రాశాను అని తెలిపారు కృష్ణ వేణి జీవితం గురించి మీర్జాపురం రాణి కృష్ణ వేణి రాశాను అని తన తొలి



వంశీ ఎన్ టి ఆర్ మహానంది గ్లోబల్ అవార్డును ప్రఖ్యాత సినిమా నిర్మాత అనూరాధ దేవికి ప్రధానం చేసిన దృశ్యం

రచన మానవత కవిత సంపుటిని మహా కవి శ్రీ శ్రీ ఆవిష్కరించారనీ గుర్తు చేసుకున్నారు స్వాగతం పలికిన వంశీ రామరాజు ఏభై ఐదు సంవత్సరాల క్రితం నటుడు శోభన బాబు ప్రారంభించిన వంశీ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేశాము అని యెన్ టి ఆర్ కు ఏ యెన్ ఆర్ కు ఒకే సారి డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భం లో వారిని ఒకే వేదిక పై రవీంద్ర భారతి లో ఒకే గజ మాల తో సన్మానం చేసిన విశేషాలు తెలిపారు సుంకర పల్లి శైలజ సుధా మయి పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో బాల కామేశ్వర రావు రామ కృష్ణ లలిత మధుర వీణ తదితరులు యెన్ టి ఆర్ సినిమాలలోని పాటలు మధురం గా ఆలపించారు.

### స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పారదర్శకంగా ఉండాలి : మేకల సారంగపాణి

**సికింద్రాబాద్, మే 28 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టినటువంటి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పారదర్శకంగా ఉండాలని, ఎటువంటి అవకతవకలు లేకుండా అధికారులు జవాబుదారితనంతో పనిచేయాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి, కంటెస్టెడ్ బిజెపి ఎమ్మెల్యే మేకల సారంగపాణి అన్నారు. బీజేపీ పార్టీ నేతలతో సికింద్రాబాద్ నియోజకవర్గం చిలుకల గూడా డివిజన్ బ్రాహ్మణబస్తీలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, చనిపోయిన వారిని గుర్తించి వాటిని తొలగించాలని అన్నారు. అధికారులు అర్హులైన వారికి ఓటర్ జాబితాలో అవకాశం కల్పించాలని మేకల సారంగపాణి కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఎప్పటికప్పుడు సమన్వయము పరచుకుంటూ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అందరికీ అవగాహన కల్పిస్తూ అర్హుల అందరికి ఓటు హక్కు కల్పించాలని, రెండు చోట్ల ఓట్లు గుర్తించి అలాగే మరణించిన వారిని గుర్తించి జాబితా నుండి తొలగించాలని సారంగపాణి అన్నారు. భారతీయ జనతాపార్టీ



సమావేశంలో పాల్గొన్న నేతలు

బీఎల్‌ఏలు ప్రజలందరికీ, అధికారులకు అందుబాటులో ఉంటారని అలాగే నియోజకవర్గం, డివిజన్ స్థాయిలో బీజేపీ నాయకులందరూ అందుబాటులో ఉంటారని ఇప్పటికే వారికి అనేకసార్లు శిక్షణ ఇవ్వడం జరిగిందని, అధికారులతో కూడా సంప్రదింపులు జరిపామని మేకల సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కనకట్ల హరి, కందటి నాగేశ్వర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ప్రభు గుప్తా అజయ్ నాయుడు, ప్రకాష్ గౌడ్, శారద మల్లేష్, అంబల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, నాగపురి శ్యామ్, ముఠా గణేష్, డివిజన్ అధ్యక్షులు ఇవి నరేష్, ఆదర్శ ముదిరాజ్, ఉపేందర్ యాదవ్, సాయి ప్రసాద్ గౌడ్, హంసరాజ్, రాజు ముదిరాజ్, నాగరాజ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## గోలకొండ పరిశోధనా గ్రంథం ఆవిష్కరణ

**హైదరాబాద్,మే 28,ప్రభాతవార్త:**

తెలంగాణ అస్తిత్వాన్ని, భాషా సంస్కృతులను చాటి చెప్పడంలో గోలకొండ పత్రిక పోషించిన పాత్ర అద్వితీయమైనదని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా పరిశోధకుడు, సీనియర్ జర్నలిస్ట్ నుగ్గునూతుల యాకయ్య రాసిన గోలకొండ పత్రిక – సాహిత్య సాంస్కృతిక చైతన్యం అనే పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథ ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమం, నాటి సామాజిక పరిస్థితులు, పత్రికా సంపాదకీయాల విశిష్టతపై వక్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఒక జర్నలిస్టుగా యాకయ్య గ్రామీణ వాతావరణం నుంచి వచ్చి క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడి ఈ విలువైన పరిశోధన చేయడం శుభపరిణామన్నారు. పత్రికా ప్రమాణాలు, నైతిక విలువలను పాటిస్తూ సురవరం ప్రతాపరెడ్డి నాటి సమాజానికి దిశానిర్దేశం చేశారని ఆయన గుర్తుచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. మరుగున పడిపోతున్న తెలంగాణ సాహితీ చరిత్రను ఈ పరిశోధన ద్వారా మళ్లీ



గోలకొండ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కోదండరాం, రామచంద్రమూర్తి,అల్లం నారాయణ, యాకయ్య తదితరులు

రచయిత యాకయ్య వెలుగులోకి తెచ్చారని కొనియాడారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సీనియర్ ఎడిటర్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప గతం, వర్తమానం, భవిష్యత్తు ఉన్నాయన్నారు. నాటి ఉద్యమాల్లో గోలకొండ పత్రిక ఏ విధంగా ఉపయోగపడిందో వివరించారు. పరాయి పాలనలో తెలంగాణ తన అస్తిత్వాన్ని ఎలా కోల్పోయిందో, ఎన్టీఆర్ కాలం నాటి తెలుగు దేశంఅనే భావన తెలంగాణ అస్తిత్వానికి ఎలా గండంగా మారిందో ఆయన ప్రస్తావించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు ప్రెస్ అకాడమీ ద్వారా సురవరం ప్రతాపరెడ్డి గారి స్ఫూర్తితో తాను నిలబడిన తీరును ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

### కలసికట్టుగా పని చేద్దాం.. విజయాన్ని సాధిద్దాం : మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

**చిక్కడపల్లి మే 28 ( ప్రభాతవార్త ) :** జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పని పని చేసి విజయాన్ని చేకూర్చాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ చెప్పారు. గురువారం బాగ్ లింగంపల్లి విఎస్టి యూనియన్ కార్యాలయం లో జల మండలి యూనియన్ ఎన్నికల నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, టీజేఈయూ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి అధ్యక్షతన టీజేఈయూ మద్దతు తెలిపిన కార్మిక సంఘాల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ప్రతి డివిజన్, ప్రతి సెక్షన్‌లో సమన్వయంతో ప్రచారం నిర్వహించి కార్మికుల మద్దతును కూడగట్టలని సూచించారు. జల మండలి కార్మికులు, నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా కలిసి పనిచేసి త్రిశూలం గుర్తుకు ఓటు వేసి టీజేఈయూ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యతే బలమని తెలిపారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లోఉన్న 90 శతం జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించిన ఘనత తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కె ఉందని అన్నారు. రంగారెడ్డి జిల్లా డి.సి.సి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్ర శేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ఈ. చంద్రశేఖర్, మేవ అధ్యక్షులు సయ్యిద్ అక్తర్ అలీ, ఏఐటీయూసీ నాయకులూ రమేష్, యూనియన్ నాయకులు బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

### హఫీజ్‌పేట్‌లో ఘనంగా బక్రీద్ వేడుకలు



హఫీజ్‌పేట్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

**గచ్చిబౌలి, మే 28 ప్రభాతవార్త**

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్‌లో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా హఫీజ్‌పేట్‌లోని నమాజ ఈదుల్ అజహా ఈద్గా దర్గా షరీఫ్ హజ్రత్ సాలార్ ఏ హౌలియాకు ముస్లింలు భారీ సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముతవల్లి సజ్జాద నషీన్ సుల్తాన్ ఆహ్సాన్ ఉద్ దౌలా ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను, దాని విశిష్టతను వివరించారు. పవిత్ర ఖురాన్ బోధనలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతియుతంగా జీవించాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐకమత్యం, సుఖసంతోషాలు నెలకొనాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు ముస్లీం సోదరులు తెలిపారు. హైదరాబాద్ నగరం హిందు, ముస్లింల ఐకమత్యానికి ప్రతీక అని, పండులను అందరూ కలిసి ఉత్సాహంగా నిర్వహించుకోవడం ఇక్కడి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, స్థానిక నాయకులు హాజరై ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రతిభ కనపరిచిన వారికి పురస్కారాలకు దరఖాస్తులు

**చిక్కడపల్లి, మే 28 (ప్రభాతవార్త ) :** తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల్లోని ప్రతిభ గలవారికి ప్రము ఖ సాంస్కృతిక సంస్థ అఖిల భార త తెలుగు సాంస్కృతిక సమైఖ్య సంస్థ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. సమైఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్. గణగళ్ళ విజ య్ కుమార్ గురువారం డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, విధి నిర్వహణ, నృత్యం, చిత్రలేఖనం, క్రీడలు, సాహిత్యం, శాస్త్రీయ సంగీ తం (గానం, నాదస్వరం, డోలు, సాక్సో ఫోన్) తదితర రంగాల్లో ప్రతి భను చాటిన వారికి అవార్డులకు అందజేయనున్నామని వివరించా రు. ప్రతిభ కనపరిచిన వారు తమ ఆధారాలకు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో ను జత చేసి సెల్ నెంబర్ : 93913 79903కు జూన్ 6వ తేదీలోగా పంపాలని కోరారు. అర్హత సాధిం చిన వారికి జూన్ 22వ తేదీన అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

### నకిలీ నంబరు ప్లేటుతో ఉన్న కారు స్వాధీనం

**జూబ్లీహిల్స్, మే 28, ప్రభాతవార్త:**

నకిలీ నంబర్ ప్లేట్‌తో ప్రయాణిస్తున్న ఒక వాహనదారుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగ ఏర్పాట్ల సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జహీరానగర్ ఓపెన్ గ్రౌండ్‌లో పార్క్ చేసిన వాహనాలను తొలగిస్తుండగా ఏపీ37ఏఆర్ 9099 నంబర్ కలిగిన మారుతి స్విఫ్ట్ కారుకు సంబంధించిన యజమానిని సంప్రదించగా, ఖమ్మంకు చెందిన మండల జశ్వంత్ స్పందించాడు. అయితే తన వాహనం ప్రస్తుతం తన దగ్గరే ఉందని, అదే నంబర్‌తో మరో వాహనం తిరుగుతోందని అనుమానం వ్యక్తం చేస్తూ ఫోటోను పంపించాడు.దీంతో పోలీసులు స్థానికంగా విచారణ చేపట్టగా, జహీరానగర్‌కు చెందిన ఇమ్రాన్ గౌరీ అనే వ్యక్తి ఆ కారును తరచూ అక్కడ పార్క్ చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో అసలు వాహనం నంబర్ పీబీ03ఎన్4993 కాగా, దానిపై నకిలీగా ఏపీ37ఏఆర్9099 నంబర్ ప్లేట్ అమర్చినట్లు గుర్తించారు. నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనాన్ని నడిపినందుకు ట్రాఫిక్ పోలీసులు శాంతిభద్రతల విభాగ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై జి. సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### మానసిక వికలాంగురాలైన మహిళను అప్పగించిన పోలీసులు

**గోషామహల్,మే28ప్రభాతవార్త:** గోషామహల్ పోలీసులు అత్యంత అప్రమత్తంతోవ్యవహరించి,సమాచారం అందుకున్న కొద్ది గంటలోనే ఒక మానసికస్థితి సరిగా లేని ఓ మహిళాను రక్షించి,కుటుంబసభ్యులకుఅప్పగించారు.ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం...ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి గ్రామానికి చెందిన పద్మ(45),గత ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి చెప్పపెట్టకుండా బయటకువెళ్లి పో యింది.కుటుంబసభ్యులు పలుచోట్ల,బందువులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు.చివరకువనపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కాగా ఈనెల 27వ తేదిన రాత్రి 10గంటల సమయంలో మతిస్దిమితం లేని మహిళా తిరుగుతుందని పోలీసులకు సమాచారం అందించారు.నైట్ ద్యూటి పెట్రోలింగ్ ద్యూటలో ఉన్న కానిస్టేబుళ్లు శంభులింగం,ఠాకూర్ ఆశిష్‌సింగ్‌లు నగర్‌ఖానా ప్రాంతంలో ఉన్న తిరుగుతున్న మహిళాను గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.ఆమెను ఎక్కడి నుంచి వచ్చావు.ఎందుకు వచ్చావు అడుగగా వనపర్తి అని చెప్పడంతో వెంటనే అక్కడి పోలీసులకు సమచారం అందించారు.అక్కడి శ్రీరంగపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళా తప్పిపోయిన కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.వెంటనే మతిస్థిమితం మహిళా,కుమారుడికి అక్కడి పోలీసులు సమాచారం అందించారు.పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి తప్పిపోయిన మానసిక స్థితి సరిగా లేని పద్మనుగోషామహల్ పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు బొరవెల్లి నరేందర్‌కు అప్పగించారు.సమయ స్ఫూర్తి తో,పట్టు దలతో వ్యవహరించి పోలీసు కానిస్టేబుళ్లను అభినందించారు.ఈ కేసు గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం

**కేశంపేట, మే 28 ప్రభాతవార్త :** విద్యారంగానికి ఎనలేని సేవలందించి రాజకీయ రంగాలలో తనదైన ముద్ర వేసిన రిటైర్డ్ హెడ్మాస్టర్, మండల మాజీ విద్యాధికారి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిడి మల్లారెడ్డి బుధవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్లారెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళులర్పించారు. ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మల్లారెడ్డి అటు విద్యా రంగంలోను, ఇటు రాజకీయంగానూ అందించిన సేవలను శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు గూడ వీరేశం, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మహిళా మండల అధ్యక్షురాలు గుండె రాణి, పలువురు సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పర్యటన

**కేశంపేట, మే 28, ప్రభాతవార్త :** నేడు శుక్రవారం కేశంపేట మండల పరిధిలో పలు కార్యక్రమాలలో మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, షాద్ నగర్ శాసన సభ్యుడు, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పర్యటించనున్నారు. అల్వాల గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనం, నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారు. అనంతరం పాటిగడ్డ గ్రామంలో పంచాయతీ, గ్రామీణ మహిళా సమైక్య భవనాల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు, ఆ తర్వాత కేశంపేటలోని ఏడుకోజ్ స్కూల్లో నిర్వహించిన ఫుట్బాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. చివరిగా వేముల నర్వ గ్రామంలో సిసి రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వం దిగివచ్చే వరకూ సమ్మె ఆపకండి



విఓఎలకు మద్దతు తెలుపుతున్న బిజెపి నేతలు

**కుల్కచర్ల, మే 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐకెపి విఓఎల సమస్యలు పరిష్కరించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. గురువారం ఐకెపి విఓఎల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగించాలని విఓఎలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వార్వల ఆంజిలయ్య, మండల బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్,జిల్లా కార్యవర్గసభ్యులు మహిపాల్, లాలు, ఆంజిలయ్య,వెంకట్, మండల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటి



నూతనంగా ఎన్నికైన వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు

**కొడంగల్,మే 28,ప్రభాతవార్త:**
తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం కొడంగల్ మండల నూతన కమిటీని సంఘం సీనియర్ నాయకులు బుస్స చంద్రయ్య అద్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అద్యక్షులుగా బస్వరాజ్‌గౌడ్,ఉపాద్యక్షులుగా జి.సాయిలు,శప్ప,ప్రధాన కార్యదర్శిగా చింతకింది శేఖర్,సహాయ కార్యదర్శులుగా పి.నర్సప్ప,పి.వెంకటప్పలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆర్ధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రెట్లను పెంచాలని,గ్రామీణ ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి రోజువారి కూలీని పెంచాలని,భూమిలేని నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం గ్రామ గ్రామాన సంఘాన్ని బలోపేతం చేస్తు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నూతన కమిటీ నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు,కార్యకర్తలు,చవ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐజిఎఫ్ అండ్ డాట్లా ఫాండేషన్ ప్రతినిధులు

## రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త :** ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థ వారు డాట్ల ఫౌండేషన్ వారి సహకారంతో తుర్కపల్లి గ్రామంలో మహిళలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవంను పురస్కరించుకుని ఐజిఎఫ్ వారు డాట్ల ఫౌండేషన్ వారి సహకారంతో మహిళలకు అవగాహన సమావేశాన్ని ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆ సంస్థ ప్రతినిధి ఎల్లబోయిన సాంబరాజు మాట్లాడుతూ ఒక దేశ అభివృద్ధిని అంఛనా వేయాలంటే మహిళల అభివృద్ధి, స్థితిగతుల ఆదారంగ చూడాలని అంటారన్నారు. దేశంలో ఉన్న మహిళల్లో సగానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతుంటారని, దీనికి సరైన పరిశుభ్రకు కావలసిన ఏర్పాట్లు, నీటి వసతి, మరుగుదొడ్లు, శానిటరీ, నాప్కిన్స్ వంటి సౌకర్యాలు లేకపోవటం కూడ కారణమన్నారు. పేదరికం వల్ల మహిళలకు, బాలికలకు కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవటం వల్ల విద్యకు, ఉపాధికి, అభివృద్ధికి దూరం అవుతన్నారన్నారు. ఇదీ దేశాభివృద్ధికి ఆటంకం కల్గిస్తుందన్నారు. ఇటీవలనే సుప్రీంకోర్టు ఆర్టికల్ 21జీవించే హక్కులో భాగంగ రుతుక్రమ పరిశుభ్రతను స్పష్టం చేసిందని వివరించారు. ప్రభుత్వాలు మహిళలకు రుతుక్రమ సౌకర్యాలు కల్పించాలని అందుబాటులో ఉంచి వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పురుషులు కూడ మహిళల నెలసరి సమస్యలను వారి వ్యక్తిగతమైన విషయంగా సిగ్గుపడవలసిన విషయంగా కాకుండ అర్థం చేసుకుని మహిళలకు తోడ్పాటు అందించాలని మహిళల భాగస్వామ్యాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. డాక్టర్ మామిడిపల్లి దీపికారెడ్డి మాట్లాడుతూ మహిళలకు నెలసరి పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. మహిళలు ఎలాంటి ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని, పరిశుభ్రతపై ఎలా చర్యలు తీసుకోవాలనే విషయంపై ఆమె అవగాహణ కల్పించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించి ఆమె వివరించారు. నెలసరి తీవ్ర నొప్పులు, తెల్లబట్ట వంటి అనారోగ్య సమస్యలకు సొంత వైద్యం మానుకుని డాక్టర్స్‌ను సంప్రదించాలని, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె మహిళలకు సూచించారు.

# వారంలో కొనుగోళ్లు పూర్తిచేయాలి

**షాద్‌నగర్, మే 28, ప్రభాతవార్త :** షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును అదనపు జిల్లా కలెక్టర్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో సమావేశమై, తడిసిన ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అదనంగా, డీఎం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ , జిల్లా పౌర సరఫరాల అధికారి (డిసిఎస్‌ఓ)లకు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, వారం రోజుల్లోగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో)కు సన్నరకం ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు (పిపిసిఎస్)లో విక్రయించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నందున, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,డైరెక్టర్ కరుణాకర్,వ్యవసాయ శాఖ అధికారులు ఆర్థిదారులు పాల్గొన్నారు.



అధికారులనుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

# ఎన్‌టిఆర్ 103వ జయంతి..నేతల నివాళి

**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానీయుడు ఎన్‌టి.రామారావు అని టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు-మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం మాజీ ముఖ్యమంత్రి-తెలుగుదేశపార్టీ వ్యస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతిని నిర్వహించారు. అంబేద్కర్‌చౌరస్తాలోని టిడిపి జెండాదిమ్మె వద్ద సంజీవగౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సంజీవగౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకొని వచ్చిన రామారావు తెలుగుజాతి అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయని కొనియాడారు. 1982 సంవత్సరంలో తెలుగుదేశంపార్టీని స్థాపించి 1983 నుంచి 1995 మధ్య మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారని తెలిపారు. రూ.2 లకే కిలో బియ్యం, ఎంసెట్ అమలు, పటేల్‌పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలలో మధ్యాహ్నభోజనం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, పేదలకు 5 లక్షల ఇండ్ల నిర్మాణం, జనతావస్త్రాలు తదితర సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత నందమూరికే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో సామల జగన్మోహన్‌రెడ్డి, సాటి సురేందర్‌రెడ్డి, ఉడతల మధుబాబుగౌడ్, వేణుగోపాల్‌రావు, నర్సింగ్‌రావు, బత్తుల మహేశ్‌గౌడ్, మద్ది రాముగౌడ్, సుభాష్‌గౌడ్, బాలాజీ, శ్రీనివాస్‌చారీ, అలియాబాద్ జనార్దన్, జేఏసీ కన్వీనర్-మాజీ మండల టిడిపి అధ్యక్షులు మారం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఘట్‌కేసర్‌లో ఎన్‌టిఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

# పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది




పదోన్నతి పొందిన ఎస్ఐలను అభినందిస్తున్న డిసిపి శిరీష రాఘవేందర్

**కేశంపేట, మే 28, ప్రభాతవార్త :** జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తు ప్రస్తుతం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న నరసింహులు శెట్టి, శ్రీనివాస్‌లకు ఎస్సైలుగా పదోన్నతి కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు షాద్ నగర్ డిసిపి శిరీష రాఘవేందర్ చేతుల మీదుగా ప్రమోషన్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం డిసిపి శిరీష రాఘవేందర్ వారికి అభినందనలు తెలిపారు. పదోన్నతి అనేది బాధ్యతను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. కొత్త హోదాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవలు అందించాలని అధికారులకు సూచించారు వివిధ రకాల సమస్యలతో వచ్చిన బాధితులకు త్వరితఘటన న్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. ఎస్సై ఇల్లుగా పదోన్నతి పొందిన అధికారులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ విధులు అంకితభావంతో నిర్వహిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సహచర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు నరసింహులు శెట్టి మరియు శ్రీనివాస్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,సర్పంచులు

**దౌల్తాబాద్, మే 28 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డిలపై మాజీ జెడ్పీటీసీ కోట్ల మైపాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారంరోజు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు అత్యవసర మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సంధర్బంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..కొడంగల్ ప్రాంతానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఇక్కడి ప్రజల అదృష్టమని కొనియాడారు.నియోజకవర్గం ఎన్నడూ లేని విధంగా ప్రగతి పథంలో దూసుకుపోతుంటే, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక కోట్ల మైపాల్ ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కోట్ల మైపాల్ నోరు అదుపులో పెట్టుకోవాలని, పెద్దవారితో మాట్లాడేటప్పుడు తన స్థాయి ఏమిటో గుర్తించుకోవాలని హెచ్చరించారు.

ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం గంటన్నర వ్యవధిలోనే చెరువులు, కుంటలు నిండిపోయేలా అసాధారణ వర్షం కురిసిందని...ఇంతటి ప్రకృతి విపత్తు వల్ల ఒక చిన్న రోడ్డు కోతకు గురైతే, దానికి నైతికత లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గతంలో రోడ్లపై గుంతలు పడితే, ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా మట్టి వేసే దిక్కు కూడా లేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రావు, బోడి వెంకట్‌రెడ్డి , జంగం వీరన్న, ప్రమోద్‌రావు, సత్యపాల్, వెంకట్‌రాములు, శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మండల కీలక నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకం కలిగించిందుకు అరెస్ట్

**శంకర్‌పల్లి, మే 28 ప్రభాతవార్త :** పోలీసుల విధులకు ఆటంకం కల్పిస్తూ నాన్న హంగామా సృష్టించిన నిందితుడిని మోకిల పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేస్తే నిందితుడి వివరాలు వెల్లడించారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ మొలగాని నాగమల్లేశ్వర్ రెడ్డి, చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు దర్యాప్తు నిమిత్తం రాత్రి సుమారు 21:15 గంటల సమయంలో గోపులారం గ్రామానికి వెళ్లి సందెంపేట రామకృష్ణను విచారిస్తున్న సమయంలో, మహరాజ్ పేట గ్రామానికి చెందిన సందెంపేట హరి మద్యం సేవించి అక్కడికి వచ్చి గొడవకు దిగడమే కాకుండా విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిని అడ్డుకొని అసభ్య పదజాలంతో దూషించాడన్నారు. ఈ మేరకు మోకిల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడు సందెంపేట హరిని ఈ రోజు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించబడినాడు.పోలీసు అధికారులు విధులు నిర్వహిస్తున్న సమయంలో వారికి ఆటంకం కలిగించడం, దాడి చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించి, చట్టాన్ని గౌరవించాలని కోరారు.





మండల కేంద్రంలో నిరసన నిర్వహిస్తున్న విఓఏ లు.

## ఉద్యోగభద్రత కల్పించాలని నిరసన

**మోమిన్‌పేట్, మే 28. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలం కేద్రంతోపాటు అన్ని గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న ఐకెపి సంఘాల విఓఏలు నిరవదిక సమ్మె చేస్తున్న సంగతి విధితమే. గురువారం మోమిన్‌పేట్ మండల కేద్రంలో గత 11,రోజులుగా నిర్వహిస్తున్న నిరవదిక సమ్మెలో బాగంగా తమకు ఉద్యోగ బద్రత కల్పిస్తామన్న ప్రభుత్వం మరిచిపోయిందేమో కాని నిరంతరం శ్రమిస్తుఉన్న మాకు ఉద్యోగ భద్రత వెంటనే కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విఏఓల రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు గత 11,రోజులుగా వివిద రూపాల్లో ఆందోళనలు నిర్వహిసుస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సంధర్భంగా మండల సమైఖ్య కార్యాలయం ఎదుట ప్లే కార్డులు పట్టుకొని తమ సమస్యలను వెంటనే పరిస్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, లేని పక్షంలో చివరికి అసెంబ్లీ ముట్టడి కూడా చేయడం జరుగుతుందని విఓఏ ల సంఘం జేఏసి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, ఆలంపల్లి లక్ష్మి, పోచమ్మ, రేశ్మ, శశికళ, రిబుక, మమత తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ నిర్మాణంపై ప్రజాగ్రహం

**షాద్‌నగర్, మే 28, ప్రభాతవార్త :** పర్యావరణాన్ని నాశనం చేసి.. పశుపక్షాదుల నుదుట మరణ చరిత్ర రాసి.. చిన్నారులను అనారోగ్యం పాలు చేసే సెల్ టవర్ మాకొద్దు.. ఎట్టి పరిస్థితుల్లోనూ దీని అనుమతించబోం.. అంటూ షాద్ నగర్ పట్టణంలోని 11వ వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో భజన కోట వెనుక భాగంలో సెల్ టవర్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమస్యపై మున్సిపాలిటీ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టవర్ పనులను కొనసాగించబోమని హెచ్చరించారు. గురువారం నిర్మాణం పనులు చేపట్టేందుకు ఇక్కడికి వచ్చిన నిర్వాహకులను అడ్డుకున్నారు.

టవర్ కారణంగా ఆరోగ్యాలు పాడవుతాయని, చిన్న చిన్న పిల్లలు, పశుపక్షాదులు జీవిస్తున్న ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని కాలనీవాసులు తెలియజేశారు. దీనిని ఇక్కడ ఏర్పాటు చేస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. మున్సిపాలిటీ కమిషనర్ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తీసుకోకపోతే ఆందోళన తప్పదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్థానికులు అడ్డుకుంటున్న సందర్భంగా చిత్రీకరించిన వీడియోలను మీడియాకు పంపారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంకాల శ్రీశైలం

## చేగూరులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**నందిగామ, మే 28, ప్రభాతవార్త:** యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడలతో ఆనందం ఆరోగ్యం లభిస్తుందని చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం స్పష్టం చేశారు. గురువారం నందిగామ మండలం చేగూరు గ్రామంలో చేగూరు జూనియర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 6 క్రికెట్ టోర్నమెంట్ ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్ల వెంకట్ చారి, ఉపాధ్యక్షుడు మంగలి మహేష్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేపల్లి కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ ఆవుల మంద శివ శంకర్, నాయకులు మంచనపల్లి రాజు, పసుల బుచ్చయ్య, బుగ్గ శ్రవణ్‌వార్డు సభ్యులు గునుగుర్తి రాజ శేఖర్, ఎండి ఖలీద్, మాన్క సురేష్, కావలి భీమయ్య, పబ్బె ప్రవీణ్, పబ్బె రవి, నాయకులు కంచె రాజు, ఎర్రోళ్ల ప్రవీణ్, కావలి శంకర్, ఎండి అలీమ్, తుగ్గుడెం సుమన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

## నిరుపేద ఇంటికి మెటీరియల్ అందజేసిన సర్పంచ్

**తలకొండపల్లి, మే 28 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కలకొండ బ్రహ్మయ్యకు ఇంటి నిర్మాణానికి కోసం అవసరమవు ఇంటి మెటీరియల్ను గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. గురువారం నాడు గ్రామానికి చెందిన బ్రహ్మయ్య నిరుపేదవాడు కావడంతో తను నిర్మించుకునే ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇల్లును మధ్యలోనే వదిలేశారు. దీంతో గ్రామ సర్పంచ్ కాకు శ్రీనివాస్ రెడ్డి బ్రహ్మయ్య తో మాట్లాడి ఇంటి నిర్మాణానికి అవసరమాగు ఇటుక, రెడ్ పిక్స్ కాంక్రీట్ ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లింగ రావు పల్లి గ్రామంలో నిరుపేద వారందరికీ తనకు తోచిన సహాయం అందజేసి అందరూ ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకునేందుకు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, బొచ్చుపల్లి రాములు, రాజమోళి చెన్నయ్య, రబ్బాని కలకొండ శ్రీలత శ్రీ రాములు తదితరులు ఉన్నారు.




## తలకొండపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**తలకొండపల్లి, మే 28, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతుల కోసం వడ్ల కొనుగోలు కేంద్రాలు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినప్పటికీ తలకొండపల్లి మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని బీజేవైఎం రాష్ట్ర నాయకులు నీలకంఠం పాండు అన్నారు. గురువారం నాడు బీజేవైఎం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ మండల కేంద్రమైన తలకొండపల్లిలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన విమర్శించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ని రైతులు ఇతర గ్రామాలకు వెళ్లి వడ్లు విక్రయించే పరిస్థితి నెలకొందని, గతంలో తలకొండపల్లి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం ఎందుకు ఇక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదని, ఇక్కడి రైతులపై ప్రభుత్వం చిన్న చూస్తుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఇక్కడికి గ్రామాల రైతులకు సౌకర్యం కల్పించవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు అనిల్ నాగరాజు విజయ్ తదితరులు ఉన్నారు.

## బక్రీద్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపిపి శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి, మే 28, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు ముజఫర్ రహమాన్‌ను మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముస్లింల పవిత్ర పండుగ అయిన బక్రీద్‌ను ఎంతో భక్తి శ్రద్ధలతో ముస్లింలు నిర్వహించుకుంటారని, ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మాజీ కో ఆప్షన్ సభ్యులు ముజాపూర్ రెహమాన్ ఉప సర్పంచ్ విజయలక్ష్మి ౖ విజయకుమార్ యాదయ్య రవి తదితరులు ఉన్నారు.

## ధాన్యం రైతులను ఆదుకోవాలి

**దౌల్తాబాద్, మే 28, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం సుల్తాన్‌పూర్, అల్లాపూర్ గ్రామాల్లో ఈ వారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం పూర్తిగా నీట మునిగింది.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సకాలంలో గన్నీ బ్యాగులు అందక,లారీలు రాకపోవడంతో గత 45 రోజులుగా ధాన్యం కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోయిందని,ఫలితంగా వర్షానికి తడిసి మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని దౌల్తాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్ ముదిరాజ్ ఆరోపిం చారు.ప్రభుత్వ వైఫల్యంతో పంట చేతికందక రైతులు తీవ్రంగా నష్టపోయి,ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాబట్టి ప్రభుత్వం వెం టనే స్పందించి,తడిసిన ..ప్రతి గింజనూ కొనుగోలు చేయడంతోపాటు బాధితులకు నష్టపరిహారం అందించాలన్నారు.

## బొట్టు సూరి 124వ సారి రక్తదానం

**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** సామాజిక సేవకుడు-టిడిపి నాయకులు శిష్టా సూర్యనారాయణరావు 124వ సారి రక్తదానం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్‌భవన్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిభిరంలో ఆయన పాల్గొని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతి సందర్భంగా 124వ సారి రక్తదానం చేశారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సూరి గతంలో 123 సార్లు వివిధ సందర్భాల్లో రక్తాన్ని ఇచ్చి రక్తదాన కర్ణుడుగా పేరు తెచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరీ జారీ చేసిన ప్రశంసాపత్రాన్ని నిర్వహకుల చేతుల మీదుగా అందజేసి అభినందించారు.



# దైవానికి కావాల్సింది సంకల్ప శుద్ధి

## గోవులను వధించకండి - బక్రీద్ వేడుకలలో మత గురువుల ఉద్బోధ

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈద్-ఉల్-అధా (బక్రీద్) వేడుకలను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్ని ప్రాంతాల మసీదులు భక్తులతో కిటకిటలాడాయి. అల్లాపై గల భక్తికి ప్రతీకగా ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరిస్తూ జంతు బలులు (ఖుర్బానీ) నిర్వహించారు. ఖుర్బానీ చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని పేదలకు దానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.**

**(వార్త న్యూస్ నెట్‌వర్క్)**

జిల్లెడు చౌదరిగూడ మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యాద్ హాఫీజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. నందిగామలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. షాబాద్ మండలంలోని షాబాద్, నాగరగూడ, బొబ్బిలిగామ, పోతుగల్, హైతాబాద్, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బోడంపహాడ్, మన్మర్రి తదితర



శామీర్‌పేటలో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యమ నాయకులు అఫ్జల్‌ఖాన్

గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాగరగూడ గ్రామంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ముస్లిం సోదరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు పట్టణ శివారు చెనిగెష్ పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.. ఈదా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో వేలమంది ముస్లింలు దాదాపు గంటపాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఈద్గా మైదానం పరిసరాల్లో పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వయంగా బందోబస్తును పరిశీలించారు. డీఎస్పీ నర్సింగ్ యాదయ్య నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, ఈద్గా కమిటి ప్రతినిధులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో వార్డు సభ్యులు జావీద్ ఆధ్వర్యం వహించారు.

కొత్తూరు మండలంలోని జెపి దర్గా ఈద్గా వద్ద ఇములనర్వ ఉపసర్పంచ్ ఎస్‌డీ సిరాజ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు.

కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ భాస్కర్ గౌడ్, మైనార్టీ అధ్యక్షులు ఎండి. మక్బుల్, సింగల్ విండో డైరెక్టర్ పల్లాటి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూడూరు, చెన్‌గోముల్, మన్నెగూడ, కద్మూరు, కంకల్, పెద్ద ఉమ్మెంతాల్, రాకంచెర్ల, మేడిపల్లి కలాన్, మంచన్‌పల్లి, నిజాంనేట్ మేడిపల్లి, తుర్క ఎన్కెపల్లి, అంగడి చిట్టంపల్లి తదితర గ్రామాల్లో బ్రక్రీద్ సందడి కనిపించింది. మత గురువుల అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి విందులో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ ఆధ్వర్యంలో ప్రార్థనలు ఘనంగా జరిగాయి.



కొడంగల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**ముస్లిం సమాజానికి చెడ్డ పేరు తేవద్దు**

దైవానికి కావాల్సింది చిత్తశుద్ధి, సంకల్ప శుద్ధి అని ఆయన పేర్కొన్నారు. అన్ని నిబంధనలు పాటించాలని ముస్లిం సమాజానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ప్రవర్తించ రాదని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కుర్బాని ఇచ్చేందుకు గోవులను వధించకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇతర మతాలను చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ముస్లిం సమాజంపై ఉందన్నారు. అదేవిధంగా ఖుర్బానీ సమయంలో వీధుల్లో రక్తం ప్రవహించేలా ఉండకూడదని, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. ఎవరైనా హద్దు దాటితే తామే ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లా కరుణ ఎంతో గొప్పదని కొనియాడారు. హాఫ్ ఏజ్ సయ్యద్ మునవ్వర్ అలీ మాట్లాడుతూ బక్రీద్ పండగ విశిష్టతను తెలిపారు.

షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్‌నగర్ ఈద్గా వద్ద బక్రీద్ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగ రాష్ట్ర



బక్రీద్ వేడుకలలో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్‌తోపాటుఅఫ్జల్‌ఖాన్, సమీయుద్దీన్, షఫియుద్దీన్, చాంద్‌పాషా, ఎండి ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

**సంపాదనలో కొంత దానం చేయాలి**

కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ముస్లీం మత పెద్ద మన్నాన్ రహబార్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.

ప్రతి ఒక్కరు తమ సంపాదనలో కొంతమేర దానధర్మాలు చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఎస్ఐ జీవీ సత్యనారాయణ, పీసీసీ ప్రతినిధి ఎండీ యుసుఫ్, కాంగ్రెస్ నాయకులు ఎస్ఎస్‌కే నయ్యూం, ఆసీఫ్‌ఖాన్, ఎస్ఎం.గౌసన్, ఎంఐఎం తాలూకా అద్యక్షులు ఎస్బీ. గుల్షన్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో నూతన వస్త్రాలు ధరించి సామూహికంగా ఈద్గాల వద్దకు వెళ్లి మత పెద్దల ఆద్వర్యంలో నమాజ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త:**

కొల్తూర్-అనంతారం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు, మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కారులో కొల్తూర్‌కు వెళ్లి పెట్రోల్ వేయించటానికి వెళ్లగా ఆ బంకులో పెట్రోల్ లేక పోవటంతో తిరిగి అనంతారం గ్రామానికి వస్తుండగ కొల్తూర్ గ్రామ పరిధిలో శివారులో ఉన్న చెట్టుకు ఆ కారు ఢీకొన్నట్లు, కారు అతివేగంగా ఉండటం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు, కారులో ఉన్న వారు సెల్ఫీ వీడియోలు తీస్తున్నట్లు అతివేగంలో ఉండటం ఈ క్రమంలోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నట్లు తెలిపారు.

అయితే దీనిలో ఎండి రహమాన్‌కు తీవ్రగాయాలు కావటం, మరో ఇద్దరికి కూడ తీవ్రగాయాలు కావటంతో ఆర్‌విఎం హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించగ ఎండి రెహమాన్ (18) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. అయితే మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. జీనోమ్‌వ్యాలీ పిఎస్ సిఐ గురువయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కష్టపడిన వారికి భవిష్యత్తులో గుర్తింపు

**-రాబోయే ఎన్నికల్లో విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలి**

**-ముఖ్యనేతలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దిశానిర్ధేశం**

**అత్తాపూర్ మే28 ,ప్రభాతవార్త :** పార్టీ కోసం పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలపునిచ్చారు.గురువారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో మైలార్‌దేవ్‌పల్లి,కాటేదాన్ డివిజన్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల పార్టీ నిలబెట్టే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు.పార్టీ కోసం పని చేసే ప్రతి నాయకుడికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నాయకుల కృషి ఉంటేనే ఎదైనా సాధిస్తామని చిన్న పెద్ద అన్ని విభేదాలు లేకుండా కలిసికట్టుగా పని చేసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలపునిచ్చారు.ప్రతి బూత్ లెవెల్ మెంబర్లను గుర్తించి ,బూత్ కమిటీలను వేసి పార్టీని మరింత బలోపే



తం చేయాలని దిశానిర్ధేశం చేశారు.ప్రభుత్వం పథకాలతో పాటు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు.అదేవిధంగా ఎస్ఐఆర్‌ను ప్రతి బూత్ కమిటీ సభ్యులను పకడ్బందీగా జరిగేలా చూడాలని నిజమైన ఓటర్‌కు న్యాయం జరిగేలా పని చేయాలని సూచించారు.శ్రమించిన ప్రతి నాయకుడికి భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా దేవరపల్లి డివిజన్ ప్రెసిడెంట్ ధనుంజయ, సరికొండ వెంకటేష్ మరియు పార్టీ సీనియర్ నాయకులు మరియు ఇతర ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఆర్ చేసి కార్మికుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



**కార్వాన్,మే 28ప్రభాతవార్త :** కార్వాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు నాయక్ 44 అనే కాంట్రాక్ట్ కార్మికుడు కార్వాన్,కుమ్మరవాడి హనుమాన్ దేవాలయం సమీపంలో ఒక విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు హై టెన్షన్ వైర్‌ను తాకడంతో తీవ్రమైన విద్యుత్ ఘాతానికి గురై స్తంభం పై నుండి కింద పడిపోయాడు.దీనితో కార్మికుడు శ్వాస ఆగిపోయి గుండె కొట్టుకోవడం నెమ్మదించి అక్కడికక్కడే స్పృహ కోల్పోయిన సమయంలో సమీపంలోనే గస్తీ విధుల్లో ఉన్న టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి.సి.4938 బి.సురేష్ బాధితుడి ఛాతిపై క్రమబద్ధంగా ఒత్తిడి తీసుకురావడంతో కొద్దిసేపటికే రాజు నాయక్ గుండె స్పందన పునరుద్ధరించబడి,ఊపిరి పీల్చుకోవడం ప్రారంభించారు.కానిస్టేబుల్ సురేష్ స్థానికుల సహాయంతో బాధితుడిని తదుపరి మెరుగైన వైద్యం కొరకు అత్యవసర వాహనంలో ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం స్థిరంగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు. ఆపత్కాలంలో అసాధారణ సమయస్ఫూర్తిని,ధైర్యసాహసాలను ప్రదర్శించి ఒక మానవ ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ బి.సురేష్ ను టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి



షాద్‌నగర్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలలో పాల్గొన్న అభిమానులు

**షాద్‌నగర్, మే 28, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణ పరిధిలోని ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు 103 వ జయంతి వేడుకలను షాద్ నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 1100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు మాట్లాడుతూ.. తెలుగునేల పులకించి పోయే తెలుగు బిడ్డ, తెలుగు ప్రజలందరి చేత అన్నగారు అనిపిలిపించుకున్న మహానేత, దక్షిణ భారతదేశంలో పుట్టిన ముద్దుబిడ్డ చరిత్ర మరువని యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అని తెలుగు నేల ఉన్నంత వరకూ ఆయన చిరస్మరణీయుడనీ, తెలుగు వారి సామాజిక రాజకీయ జీవనంలో ఎన్టీఆర్‌ది ఓ కీలక ఘట్టం అనీ ఆ మహానాయకుడి శత జయంతి ఉత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటున్నారనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు బండారుపల్లి నాగేశ్వర రావు, కొర్రపాటి శ్రీనివాస్ రావు, పాతూరి సత్యనారాయణ, పినపాక ప్రభాకర్ , గుదే వసంత రావు, పాతూరి బ్రహ్మయ్య , వట్టికొండ ఎర్రయ్య, మక్కపాటి మల్లేశ్వర రావు, నువ్వుల నాగేశ్వరరావు, ఆలపాటి పూర్ణ, కొడాలి సురేష్, కృష్ణారావు, కిలారు సాంబయ్య, సంజీవ రావు, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, కట్టా అప్పారావు, గుదే మస్తాన్ రావు, మలినేని శ్రీను , కట్టా హరి, కొత్త ప్రభాకర్, కొర్రపాటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్, యడ్ల శ్రీనివాస్ , కట్టా హరి, బొల్లినేని కోటేశ్వర్ రావు, పేరం అనిల్ , కనుమూరి రమేష్, కొర్రపాటి వెంకట్రావు, ఆలూరి శ్రీనివాస్, బ్రహ్మయ్య చౌదరి, మాధవ రావు. బాలయ్య, వెంకటేశ్వర రావు . నువ్వుల నాగేశ్వర్రావు, నువ్వుల వెంకటేశ్వర రావు , శశి, పాతూరి రఘు, పాతూరి విద్యాసాగర్, మక్కపాటి సతీష్ , సిరిపురపు వెంకటరమణ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..



కొత్తూరులో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

**గుండెల్లో కట్టుకున్నాం**

**కొత్తూర్, మే 28, ప్రభాతవార్త:** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను గురువారం కొత్తూరులో ఘనంగా నిర్వహించారు. టిడిపి మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగగళ్ళ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య కూడలిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. తెలుగు సినీ రంగంలో ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలు పోషించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా ఎదిగి పేదల సంక్షేమానికి ఎన్నో విప్లవాత్మక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గురుకుంట గణేష్ గౌడ్, టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు కమ్మరి యాదగిరి చారి, ఎండి నవాబ్, బుచ్చయ్య, అర్జునయ్య గౌడ్, మంగలి కృష్ణయ్య, పిట్టల బాలరాజ్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ వ్యాఖ్యలు గర్హనీయం

**-తాపీమేస్త్రీల ఆత్మగౌరవసభకు రావాలి**

**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** తాపీమేస్త్రీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా అవహేళన చేస్తూ సెంట్రింగ్ కాంట్రటాక్టర్ అసోసియేషన్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని ఘట్‌కేసర్ బిఎన్ఆర్‌కెఎస్ సంఘం ఖండించింది. ఘట్‌కేసర్ డివిజన్ ప్రైమ్‌లాండ్ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో గురువారం బిఎన్ఆర్‌కెఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామల్ల అయిలయ్య ఆదేశాల మేరకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జూన్ 8న జరిగే తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభ కరపత్రాన్ని స్థానిక సంఘం సభ్యులు విడుదల చేశారు. ఘట్‌కేసర్ సంఘం అధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు, వై.చెన్నయ్య, టి.శ్రీను, ఎం.మాల్యాద్రి, ఎం.శ్రీనివాస్, ఓ.మల్యాద్రి, ఓ.రాంబాబు, టి.శ్రీను, టి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసులు, అంకం రావులు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్లు పెంచడం కోసమో, హక్కుల కోసమో అయితే తాపీమేస్త్రీల మద్దతు ఉండేది. కానీ తాపీమేస్త్రీ హటావో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు బచావో, తాపీ మేస్త్రీలు మధ్యవర్తులు, దళారుల అనే నినాదాలతో సమ్మె కొనసాగించడం ఏమిటని వారు ప్రశ్నించారు. కార్మికులు సంఘటితమై హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో తోటి తాపీ కార్మికులపై నిందలు మోపుతూ సమ్మె చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాపీ మేస్త్రీ భవన నిర్మాణ రంగంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నాడని పేర్కొన్నారు. ఐక్యతతో కలిసి పోరాటం చేసినప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమైతుందని గుర్తు చేశారు. జూన్ 8న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తాపీమేస్త్రీల ఆత్మగౌరవ సభలో మేస్త్రీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఘట్‌కేసర్‌లో కరపత్రం విడుదల చేస్తున్న తాపీమేస్త్రీలు

## బహుముఖ ప్రతిభావంతుడు సురవరం ప్రతాపరెడ్డి: ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

**ముషీరాబాద్, మే 28, ప్రభాతవార్త:** బహుభాషావేత్తగా, సాహితీవేత్తగా, చరిత్రకారుడుగా, పత్రిక సంపాదకుడుగా, గ్రంధాలయ ఉద్యమ సారధిగా తెలంగాణ ప్రజలను జాగృతం చేసిన సురవరం ప్రతాపరెడ్డి బహుముఖ ప్రతిభావంతుడని తెలంగాణ సారస్వత పరిషద్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. గురువారం సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ పైనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో నలిగిపోతున్న తెలుగు భాషా సంస్కృతులకు దిశా నిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి అయిన సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్ర గ్రంధాలయ ఉద్యమానికి అధ్యక్షులుగా పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణలో కవులే లేరు అని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముడుంబ వెంకట రాఘవాచార్యులు అనే కవి నిందిస్తే, దానిని సవాలుగా తీసుకున్న సురవరం ప్రతాపరెడ్డి, అవిశ్రాంతం కృషి చేసి, తెలంగాణలో గొప్ప కవులు ఉన్నారని నిరూపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు కార్యదర్శి సురవరం పుష్పలతరెడ్డి, సభ్యులు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, సురవరం కుటుంబ సభ్యులు, రచయితలు, కవులు పాల్గొన్నారు.



సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

## హిందూ దేవుళ్లను సాక్షాత్కరింపజేసిన మహానటుడు ఎన్టీఆర్ : సిరికొండ మధుసూదనా చారి

**చిక్కడపల్లి, మే 28 ( ప్రభాతవార్త ) :** హిందూ దేవుళ్లను తెరపై సాక్షాత్కారం చేసి ప్రేక్షకుల గుండెల్లో కొలువైన మహానటుడు నందమూరి తారక రామరావు అని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. గురువారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళావెంకటదీక్షి తులు కళావేదికలో ఎన్.టి.ఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై కవిసమ్మే ళనం, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మధుసూదనా చారి మాట్లాడు తూ.. ఎన్టీఆర్ తన నటనతో, ప్రజాసేవతో తెలుగువారి గుండె ల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. సమాజంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువు రు ప్రముఖులకు ఎన్.టి.ఆర్. స్ఫూర్తి అవార్డుఖిలను అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతలలో వింజం వెంకట నారాయణ, శ్రీలతా ధావన్, దుబ్బా భాస్కర్ రావు, డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం, డాక్టర్ నన్నపురాజు విజయశ్రీ, డాక్టర్ చీదరాల చెన్నయ్య, ప్రమోద్ కుమార్, అంకూరి శివ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సేవారత్న వడ్లకొండ వెంకట్రావు, డాక్టర్ మేడిది వెంకటేశ్వర రావు, లయన్ నిర్మలా ప్రభాకర్, అందె శ్రీనివాసులు, డాక్టర్ రాధ కుసుమ, కార్యక్రమ నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, సాంబశివ రావు, అంజలి నాట్యాలయం నిర్వాహకురాలు హంస వేణి, అలాగే పలువురు



పురస్కారాలను ప్రధానం చేసిన దృశ్యం

# బిజెపి నాయకుడితో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలి

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త:** నకిలి ఇళ్లపట్టాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను మోసం లక్షల రూపాయలు దండుకున్న బిజెపి నాయకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ కైరతాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షురాలు వర్ష జైస్వాల్, సామాజిక కార్యకర్త కరిష్మా జైస్వాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపికి చెందిన నగర నాయకుడు నారాయణగూడ విఠల్‌వాడి నివాసి బిజెపి నాయకుడు హిమాయత్‌నగర్ డివిజన్‌లోని కొంత మంది పేద, మధ్యతరగతి ప్రజలకు మేడ్చల్, మల్కాజ్‌గిరి, చంగిచర్ల గ్రామంలోని సర్వే నెంబరు 58లో ఇళ్ళ పట్టాలు ఇప్పిస్తానని చెప్పి లక్షలాది రూపాయలు దండుకుని నకిలి పట్టాలను పంపిణి చేశారని ఆరోపించారు. పట్టాలు అందుకున్న పేదలు సర్వే నెంబరు 58కి వెళ్ళి చూడగా ఆది ప్రభుత్వ భూమి అని తెలుసుకుని మోసపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు బిజెపి నాయకుడి వద్దకు వెళ్ళి అడిగితే తన వెనుక చింతల రామచంద్రారెడ్డి, కేంద్ర ప్రభుత్వం ఉందని, ఎవరికైనా చెపితే చంపుతామని భేదించారని వారు ఆరోపించారు. దీంతో బాధితులు తమను ఆశ్రయించడంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఈ సమస్యపై చింతల రామచంద్రారెడ్డి స్పందించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపి బాధితులకు నాయ్యం చేయాలని వారు కోరారు.




బిజెపి నాయకుడి ఫోటోను ప్రదర్శిస్తున్న వర్ష జైస్వాల్, కరిష్మా జైస్వాల్

# రిచ్‌కిడ్స్ సెక్స్‌ట్రాప్ కేసులో జితిన్ అరెస్ట్

**జూబ్లీహిల్స్, మే 28, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రిచ్‌కి డ్స్ సెక్స్ ట్రాప్ కేసులో నిందితుడిగా ఉన్న జితిన్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బాలి కలను ట్రాప్ చేసి లైంగికంగా దాడి చేయడమే కాకుం డా బెదిరింపులకు పాల్పడి డబ్బుల వసూలుకు పాల్ప డిన సంఘటనలో జూబ్లీహిల్స్ పోలీసులు మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో ఇప్పటికే తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో మొత్తం అయిదు కేసులు జూబ్లీహిల్స్ పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నింది తుడిగా ఉన్న చంద్రశేఖర ఆజాద్ అలి యాస్ అర్జున్, అతని సోదరుడు రాజీవ్, పనిమనిషి సరస్వతి, కార్తిక్, ఆజాద్ తల్లి మీనాకుమారి, బంధువు ప్రశాంత్, వినీల్ చౌదరి, జితిన్, హేమంత్‌లపై కేసు నమోదు చేశారు. ఇందులో జితేందర్‌రెడ్డి అలియాస్ జితిన్‌పై ఇటీవల ఒక యువతి(16) తనను లైంగికంగా దాడి చేసి డబ్బు ల వసూలుకు పాల్పడ్డాడం టూ జూబ్లీహిల్స్ పోలీసుల కు ఫిర్యాదు చేయగా పోలీసులు జితిన్‌పై మరో పోక్సో నమోదు చేశారు. పరారీలో ఉన్న జితిన్‌ను బుధవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇదిలా ఉండగా పోక్సో కేసులో ఆజాద్‌ను అయిదు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

## 30న జింఖానా గ్రౌండ్‌లో మా వైష్ణోదేవి జాగరణ

**కంటోన్మెంట్,మే 28 ప్రభాతవార్త:** మా వైష్ణోదేవి జాగరణ మండ ల్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన రాత్రి సికింద్రాబాద్ ఛలో బులవ అయా హై మాతానే బులయ హై వేడుకలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మావైష్ణోదేవి జాగరణ మండల్ చైర్మన్ సురేందర్ జోషి,వైస్ చైర్మన్ వినోద్ పొద్దర్,అధ్యక్షులు కైలాస్ చంద్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి బి.ఎన్. శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడు తూ గత 31 సంవత్సరాల నుంచి ప్రతి యేటా తమ సంస్థ సొంత నిధులతో మావిష్ణోదేవి జాగరణ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నా మన్నారు. సనాతన ధర్మాన్ని భావి తరాలకు చాటి చెప్పే విధంగా హిందూ సాంస్కృతి సాంప్రదాయాలతో అమ్మ ఆశీస్సులతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా దేశ ప్రజలు సుబిక్షంగా ఉండాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ నెల 30న రాత్రి 8.30 ప్రారంభం అవుతుందన్నారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు జమ్మూ కాశ్మీర్‌లోని మా వైష్ణోదేవి ఆలయం నుంచి తెచ్చిన ప్రసాదంతో పాటు వైష్ణోదేవి ప్రతిమ ఉన్న నాణెన్ని భక్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ జాగర ణకు వచ్చే భక్తులకు ఉచితప్రవేశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండాప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సంజయ్ అగర్వాల్,సందీప్ సింగ్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థి చదువుకు రూ.25 వేల అందజేత

**యూసుఫ్‌గూడ మే 28 ప్రభాతవార్త :** తమకు ఉన్నదాంట్లో కొంత ఇతరులకు సహాయం చేసినప్పుడే జీవితంలో నిజమైన సంతృప్తి లభిస్తుందనేదానికి నిదర్శనంగా ఓ విద్యార్థిని తన కిడ్డీ బ్యాంక్‌నుంచి మరో పేద విద్యార్థి చదువు కోసం ఆర్థికసాయాన్ని అందించింది. అల్లాపూర్ డివిజన్ వివేకానంద్‌నగర్‌కు చెందిన తేజామై నాయుడు తన జన్మదినం సందర్భంగా పంచశీల కాలనీ ప్రగతి స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విశాల అనే విద్యార్థి ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న తేజామై నాయుడు విద్యార్థికి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.25 వేలను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు లైన్స్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా తేజామై నాయుడిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ చైర్మన్ కెల్లా వెంకటరావు, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ గౌవర్నర్ డాక్టర్ మహేందర్ రెడ్డి, ప్రెసిడెంట్ కైలాష్, సభ్యులు కృష్ణయ్య, దామోదర్, రమేష్ నాయుడు, శ్రీలత, సౌజన్య, వాణి పాల్గొన్నారు.